# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024






### ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 8లో



### ...పీఆర్టీయూ పాత్ర కీలకం

విద్యా వ్యవస్థలో పీఆర్టీయూ పాత్ర కీలకమని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. ఆదివారం జరిగిన జిల్లా కౌన్సిల్‌లో మాట్లాడారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

### వాతావరణం

జిల్లాలో సోమవారం తేమ వాతావరణం ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అసిస్టెంట్ ఫోర్‌మెన్ పరీక్షకు 161 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థవ్యాప్తంగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఫోర్‌మెన్ పోస్టుల భర్తీకి ఆదివారం సింగరేణి మహిళా కళాశాలలో ఇంటర్నల్ అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. 25 అసిస్టెంట్ ఫోర్‌మెన్ (ట్రైనీ ఎలక్ట్రికల్ టీఅండ్‌ఎస్ గ్రేడ్ సీ) పోస్టులు ఖాళీగా ఉండగా, 161 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పర్సనల్ జీఎం సామ్యేల్ సుధాకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి సింగరేణి వెబ్‌సైట్‌లో, ప్రధాన కార్యాలయం ప్రధాన గేట్ వద్ద నోటీస్ బోర్డులో పొందుపరుస్తామని తెలిపారు. అధికారులు వేణుగోపాలరావు, రామకృష్ణ, ప్రకాశ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

### నేడు కలెక్టర్ వద్దకు మహిళా కోష్ బాధితులు

చంద్రుగొండ : మహిళాకోష్ బాధితులు నేడు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ వద్దకు వెళ్లనున్నారు. మండలానికి 2006లో మంజూరైన రూ. 50 లక్షల రాష్ట్రీయ మహిళాకోష్ రుణాల చెల్లింపుల విషయమై అప్పటి మండల సమాఖ్య అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి కాంతకుమారి, కార్యదర్శి కాంతిలకు ఢిల్లీ మెట్రోపాలిటిన్ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ ఉదంతంపై ఆదివారం 'వెంటాడుతున్న మహిళా కోష్ రుణాలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. చెల్లింపులపై పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కలెక్టర్, ఎస్పీలను కలవనున్నట్లు తెలిపారు.

### నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులంతా అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు.

### కోలిండియా విన్నర్‌గా రామకృష్ణ



చాంపియన్ షిప్ అవార్డ్ అందుకుంటున్న రామకృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): ఒడిశా రాష్ట్రంలోని మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కోలిండియాస్థాయి బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 75 కేజీల విభాగంలో కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్‌ఓసీలో పనిచేస్తున్న ముద్దెన రామకృష్ణ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఓవరాల్ బాడీ బిల్డింగ్‌లో చాంపియన్ షిప్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఇతర డైరెక్టర్లు, ఏరియా జీఎం ఎం శాలేంరాజు, ఇతర అధికారులు అభినందించారు.

### జిల్లా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



జిల్లా సర్వజన ఆస్పత్రిలో మురుగునీటిని పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో నెలకొన్న డ్రెయినేజీ, వెంటిలేటర్ లేమి, ఎక్స్‌రే టెక్నీషియన్, వైద్యుల కొరత తదితర సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఎస్పీ నాయకులు జిల్లా ఆస్పత్రిని సందర్శించి మురుగు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ 600 మందికి పైగా పేషెంట్లు వచ్చే ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల్లేక, ఉన్నా సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరిపడా మందులు లేవని, వెంటిలేటర్లు పని చేయటం లేదని ఆరోపించారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సాయి, వినయ్, అబ్దుల్, నాగుల రవికుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణం.. ప్రయాసే..



రైళ్లు రాకపోవడంతో ప్రయాణికులు లేక వెలవెలబోతున్న కొత్తగూడెం రైల్వే స్టేషన్

| దారి మళ్లించిన కొన్ని ప్రధాన రైళ్లు.. | |
|---|---|
| కాకినాడ – షిర్డీ | విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి |
| ఈస్ట్‌కోస్ట్ | విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి |
| కృష్ణా | విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి |

ఈ నెల 23 నుంచి వచ్చే నెల 8 వరకు రద్దు చేసిన రైళ్ల వివరాలు

| రైలు | రద్దయ్యే రోజులు |
|---|---|
| సింగరేణి | 26 నుంచి 8 వరకు |
| కాకతీయ | 25 నుంచి 7 వరకు |
| శాతవాహన | 25 నుంచి 7 వరకు |
| గోల్కొండ | 23 నుంచి 7 వరకు |
| ఇంటర్‌సిటీ | 23 నుంచి 2 వరకు |
| అండమాన్ | 25 నుంచి 8 వరకు |
| భాగ్యనగర్ | 23 నుంచి 7 వరకు |
| రామగిరి | 26 నుంచి 8 వరకు |
| కోచివెల్లి – గోరఖ్‌పూర్ | 26,30, 2, 3, 7 |

### పండుగ వేళ పలు రైళ్ల రద్దు, కొన్నింటి దారి మళ్లింపు

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు తప్పని ఇక్కట్లు
- దసరా ప్రయాణాలకు ఆర్టీసీ బస్సులే ఆధారం
- సర్వీసుల సంఖ్య పెంచాలని కోరుతున్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉత్తర తెలంగాణకు ప్రధాన కేంద్రంగా ఉన్న వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు మరి కొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలకు దసరా సెలవుల్లో ప్రయాణం కష్టంగా మారనుంది. చెన్నై–న్యూఢిల్లీ గ్రాండ్‌ట్రంక్ సెక్షన్‌లో కీలకంగా ఉన్న కాజీపేట జంక్షన్–వరంగల్‌ల మధ్య రైలు మార్గాన్ని విస్తరిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో పగటి వేళ ప్రయాణించే ప్రధాన రైళ్లను సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేశారు. కొన్ని దూర ప్రాంత రైళ్లను విజయవాడ – గుంటూరు – నల్లగొండ – పగిడిపల్లి మీదుగా దారి మళ్లించారు. ఫలితంగా కాజీపేట – విజయవాడ మార్గంలో ఖమ్మం, మధిరల మీదుగా వెళ్లే రైళ్ల రాకపోకలు లేకుండాపోయాయి. దీంతో ఇటు వరంగల్, హైదరాబాద్ అటూ విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల వైపు రైలు ప్రయాణం కష్టంగా మారింది. ముఖ్యంగా ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం, బోనకల్ స్టేషన్ల నుంచి నిత్యం వేలాది మంది విజయవాడకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ పండుగ వేళ సులభమైన ప్రయాణ సౌలభ్యం దూరమైంది.

**దసరా సెలవులు రావడంతో..**

తెలంగాణలో దసరా సెలవులను అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తర తెలంగాణలో దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా పల్లె, పట్నం తేడా లేకుండా బతుకమ్మ ఆటలు ఆడుతారు. దీంతో పండగల సందర్భంగా సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు కుటుంబ సమేతంగా ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి. సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు వరంగల్, కాజీపేటల మీదుగా పగటి వేళ నడిచే సింగరేణి, కాకతీయ, గోల్కొండ, శాతవాహన వంటి అనేక రైళ్లు రద్దయ్యాయి. దీంతో సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు ప్రధాన రవాణా సదుపాయం దూరమైనట్లయింది.

#### ఇక ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరకని ప్రయాణమే..

పండుగ సెలవుల ఆరంభంలో రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్సులే ప్రయాణానికి అందుబాటులో ఉండనున్నాయి. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కారణంగా సాధారణ రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో సీట్లు దొరకడం కష్టంగా మారింది. ఇక దసరా వంటి పెద్ద పండుగలు వరుసగా పది రోజులకు మించి విద్యాసంస్థలకు సెలవులు వచ్చినప్పుడు ఈ రద్దీ మరింత పెరగనుంది. సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో రాకపోకలకు ప్రజలు మరింత ఇబ్బంది పడేందుకు ఆస్కారం ఉంది. కొత్తగూడెం నుంచి గోదావరిఖని వరకు కేవలం పదిలోపే బస్సులు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా ప్రధానంగా రాత్రి వేళనే నడుస్తున్నాయి. పగటి వేళ వెళ్లాలంటే వరంగల్/హన్మకొండకు చేరుకుని అక్కడి నుంచి మంచిర్యాల, గోదావరిఖనిలకు వెళ్లాల్సి ఉంటుంది. రైళ్ల రద్దును దృష్టిలో ఉంచుకుని సర్వీసుల సంఖ్య పెంచేలా ఆర్టీసీ కసరత్తు చేయాల్సిన అవసరం ఉంది.

# కానరాని బతుకమ్మ శోభ!

- చెరువులు, నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లు కరువు
- మహిళలకు చీరలు పంపిణీ చేయని ప్రభుత్వం
- అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో సంబురాలు ప్రారంభం




పాల్వంచలోని చింతల చెర్వు ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయని దృశ్యం

పాల్వంచ: మరో రెండు రోజుల్లో తెలంగాణ సంప్రదాయ వేడుక బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానుండగా, జిల్లాలో ఎక్కడా పండుగ వాతావరణం కనిపించడంలేదు. ఈ సారి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. బతుకమ్మల నిమజ్జనానికి చెరువులు, వాగులు, ఆలయాలు, బతుకమ్మఘాట్ల వద్ద అధికారులు ఏర్పాట్లు కూడా చేయడంలేదు. పట్టణాలు, పల్లెల్లోనూ అదే పరిస్థితి నెలకొంది.

**బతుకమ్మ విశిష్టత**

భాద్రపద మాసంలో మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తొలిరోజు ఎంగిల పూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బతుకమ్మ ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. మహిళలు రంగు రంగుల పూలతో గౌరమ్మ(బతుకమ్మ)ను పేర్చి జానపదాలు పాడుతూ వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేస్తారు. బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో.. తదితర పాటలు ఆలపిస్తూ సందడి చేస్తారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి చెరువులు, ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. రోజుకో రకమైన నైవేద్యం సమర్పిస్తూ మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నాన బియ్యం బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయ బతుకమ్మ, వెన్న ముద్దల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. ఇక్కడి నుంచి వెళ్లి ఇతర దేశాల్లో స్థిరపడ్డవారు కూడా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారు. బతుకమ్మ వేడుకల అనంతరం దసరా పండగను అంగరంగవైభవంగా నిర్వహిస్తారు.

#### ఏర్పాట్లు ఏవీ..?



తెలంగాణ ప్రజల సంప్రదాయ పండుగ బతుకమ్మ ఉత్సవాలకు గతంలో ప్రభుత్వం చీరలు పంపిణీ చేసేది. వేడుకలను ఆటపాటలతో నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసేది. ఈ సారి మహిళలకు చీరల బదులుగా రూ.500 నగదు పంపిణీ చేస్తారని ఆశించినా ఇంకా అవి అందలేదు. వాగులు, చెరువులు, దేవాలయాల వద్ద బతుకమ్మ ఘాట్లను గుర్తించి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. చెత్తా చెదారం తొలగించి, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

#### ఉత్సవాలు ఎంతో ప్రత్యేకం



దసరా ఉత్సవాలు, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆటపాటలతో నిర్వహిస్తారు. వివిధ రకాల పిండివంటలు తయారు చేసుకుని బంధుమిత్రులతో కలిసి ఆనందంగా పండుగలు జరుపుకుంటారు. కానీ పండుగ ఏర్పాట్లపై ప్రభుత్వం ఇప్పటివరకు దృష్టి పెట్టక పోవడం బాధాకరం.

–గొడవర్తి సంపత్‌కుమార అప్పలాచార్య, ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి

#### ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటాం



బతుకమ్మ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఘాట్లను గుర్తించాం. అక్కడ తగిన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం.

–దాకూ నాయక్, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

# 'కాంట్రాక్ట్'తో కల సాకారం!

- తీరనున్న 2008 డీఎస్సీ అభ్యర్థుల కోరిక
- నేడు సర్టిఫికెట్ల పరిశీలన



ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వ ఉద్యోగం.. అందులోనూ ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మందికి ఇష్టం. అలాంటి ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి చదివి.. పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినా ఇప్పటివరకూ కొలువు దక్కని పరిస్థితి 2008 డీఎస్సీ అభ్యర్థులది. వారి కల సాకారం చేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా ఉద్యోగావకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇన్నాళ్లు వేచి చూసిన అభ్యర్థులకు ఊరట కలగనుంది.

**ఉమ్మడి జిల్లాలో 343 మంది..**

విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తున్న క్రమంలో 2008 డీఎస్సీలో ఉత్తీర్ణులైన వారిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 343 మంది అభ్యర్థులు ఉండగా మైదాన ప్రాంతం వారు 128 మంది, ఏజెన్సీ అభ్యర్థులు 215 మంది ఉన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వీరిని నియమిస్తే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

**జిల్లాలో ఎస్జీటీల కొరత..**

జిల్లాలో 813 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, సుమారు 2,500 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియతో పలు పాఠశాలల్లో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)ల కొరత ఏర్పడింది. ఇటీవల బదిలీ అయిన ఎస్జీటీలను కొత్త ప్రాంతాలకు వెళ్లేందుకు సైతం ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయలేదంటే వారి కొరత ఏ మేరకు ఉందో తెలుసుకోవచ్చు.

#### ఐదు కౌంటర్ల ద్వారా పరిశీలన..

ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో సోమవారం 2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఇందుకోసం ఐదు కౌంటర్లు ఏర్పాటుచేయగా.. ఒక్కో కౌంటర్‌కు ఒక హెచ్ఎం సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది ప్రధానోపాధ్యాయులకు సహాయకులుగా ఉంటారు. ఇదిలా ఉండగా 343 మంది అభ్యర్థుల్లో 150 నుంచి 200 మంది మాత్రమే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అనేక సంవత్సరాలు కావడంతో కొందరు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడగా.. మరికొంత మంది వివిధ వృత్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

#### ఏర్పాట్లు పూర్తి చేశాం



2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు కూడా వెంట తీసుకుని రావాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– సోమశేఖర శర్మ, డీఈఓ, ఖమ్మం.

### ప్రకృతికి సహకరిస్తే మనకే రక్షణ



మాట్లాడుతున్న కవి జయరాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రకృతికి మనం సహకరిస్తే అది మనల్ని కాపాడుతుందని కవి జయరాజు అన్నారు. ఆదివారం బస్టాండ్ సెంటర్‌లోని ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి జయరాజు హాజరై మాట్లాడారు. ఇటీవల అనారోగ్యానికి గురైన తనకు కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో హెచ్‌ఆర్ సుగుణారావు ప్రకృతి వైద్యం అందించాడన్నారు. కొత్తగూడెంలోని తన మిత్రులు చూపిన ఆత్మీయత, అనురాగాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. అనంతరం బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక అంశాలతో పాటు బుద్ధిజాన్ని, ప్రకృతి ప్రేమను సమాజంలోని కిందిస్థాయి వరకు అర్థమయ్యేలా, పాటలు రాస్తూ, పాడుతూ సాధారణ ప్రజల మనసులు దోచుకున్న ప్రకృతి కవి జయరాజు అని పేర్కొన్నారు. జయరాజును ప్రకృతి నిండు నూరేళ్లు కాపాడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య, డాక్టర్ కనకరాజు, పురుషోత్తమరావు, రమేశ్‌కుమార్ మక్కడ్, సంఘం వెంకటపుల్లయ్య, సుగుణారావు, కొచ్చర్ల కమలారాణి, ఏజీఎం గోనె శ్రీకాంత్, ముస్తఫా, ఆనంద్, వసంతక్క, జె.బాలశౌరి, ఎర్రా కామేశ్, నాగా సీతారాములు, సింగ్ ఉపేందర్, మారపాక రమేశ్ పాల్గొన్నారు.

# కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 380 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,470, 120 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.7,350 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం జరిపారు. అనంతరం సువర్ణ పుష్పార్చన గావించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

### అమ్మవారికి విశేష పూజలు



ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచీ భక్తులకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు, సారెలను సమర్పించారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

**ఆలయానికి విరాళం**

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన పాల్వంచలోని గట్టాయిగూడేనికి చెందిన పి.రామప్ప శాస్త్రి శ్రీదేవి దంపతులు రూ.11,116 విరాళం అందజేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. దాతలకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

## క్లుప్తంగా

### సాత్విక్‌కు జాతీయస్థాయి బహుమతి



బహుమతి అందుకుంటున్న సాత్విక్

అశ్వారావుపేటరూరల్: జాతీయ స్థాయిలో ఖమ్మానికి చెందిన వురిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన సిద్ధాంతపు సాత్విక్ సాయికుమారాచార్యులుకు ప్రత్యేక బహుమతి దక్కింది. ఆదివారం ఖమ్మంలో సంస్థ వురిమళ్ల సునంద అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో ఈ బహుమతిని ప్రదానం చేశారు. విద్యార్థులకు తొలిసారిగా పుస్తక సమీక్ష పోటీలు నిర్వహించినందుకు, నిర్వాహకులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. దీంతో ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన సాత్విక్‌కు సంస్థ బాధ్యులు ప్రశంసించి, బహుమతిని అందించారు.

### శతాధిక వృద్ధురాలి మృతి



ఆదెమ్మ (ఫైల్)

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ గ్రామానికి చెందిన ఉడుముల ఆదెమ్మ (103) అనారోగ్య సమస్యలు తలెత్తడం, వయోభారంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆదెమ్మకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మె మృతదేహాన్ని పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లెందు: టేకులపల్లి మండలం 9వ మైలుతండాకు చెందిన ఎం.గణేశ్(23) ప్రేమ విఫలం కావడంతో ఈ నెల 23న ఇల్లెందు సమీపాన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు, ఆపై ఖమ్మం తరలించి వైద్యం అందించగా.. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. బావ జి. చరణ్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రాజారత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టేకు దిమ్మెలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మెలు

మణుగూరు టౌన్: బైక్‌పై అర్ధరాత్రి టేకు దిమ్మెలను తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అటవీ అధికారులు ఆదివారం కేసు నమోదు చేశారు. రేంజర్ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా కూనవరం రైల్వే గేట్ సమీపాన సెక్షన్ ఆఫీసర్ రామచంద్రయ్య, బీట్ ఆఫీసర్ పద్మ, బేస్ క్యాంప్ సిబ్బంది వినోద్‌లు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ వ్యక్తి తన బైక్‌పై టేకు దిమ్మెలు తీసుకొస్తుండగా.. పట్టుబడ్డాడు. దీంతో బైక్ స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రేంజర్ తెలిపారు.

### పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్‌తండా గ్రామంలో ధరావత్ లచ్చుకు చెందిన పూరిల్లు ఆదివారం దగ్ధమైంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి అందులోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈమేరకు గ్రామస్తులు ఇచ్చిన ఫైర్ స్టేషన్‌క సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని వ్యాపించిన మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపారు.

### హత్య కేసులో నిందితులు అరెస్ట్

కామేపల్లి: యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. పాతలింగాల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఎస్‌ఐ సాయికుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా గోవింద్రాల గ్రామానికి చెందిన సభావత్ మల్సూర్, లకావత్ సుమన్ బైక్‌పై వెళ్తుండగా ఆపే ప్రయత్నం చేశారు. వారు పారిపోతుండగా పట్టుకొని విచారించగా ఈ నెల 26న రాత్రి అదే గ్రామానికి చెందిన ఆలోత్ భాష్‌సింగ్‌ను రాయి, కర్రతో కొట్టి చంపినట్లు తెలిపారు. భాష్‌సింగ్ కొద్ది రోజులుగా వీరి గురించి చెడుగా మాట్లాడుతుండటంతో చంపామని ఒప్పుకున్నారని, హత్యకు వినియోగించిన రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

### పామాయిల్ గెలలు



| టన్ను ధర | రూ.14,392 |
|---|---|

# ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

**అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..**

- జోనల్ పరిధి నుంచి హాజరైన 650 మంది
- తొలిరోజు ఉత్సాహంగా కొనసాగిన పోటీలు
- పోటీలను ప్రారంభించిన సీసీఎఫ్ భీమానాయక్



క్రీడోత్సవాల ప్రారంభం సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న సీసీఎఫ్ భీమానాయక్ తదితరులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

చుంచుపల్లి: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందుకోసం రెండు ప్రాంగణాలను వినియోగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల నుంచి 650 మంది అటవీ ఉద్యోగులు హాజరు కాగా, అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించగా, సీసీఎఫ్ భీమానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడితో ఉండే అటవీ ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణలో అటవీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. అప్పడప్పుడూ సిబ్బంది క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఆరోగ్యం పరిరక్షణకు తగిన వ్యాయామంతో పాటు ఆటలు ఆడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమయం దొరకినప్పుడల్లా మైదానాలకు వెళ్లి ఇష్టమైన ఆటలు ఆడాలని సూచించారు. ఈ రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడాంశాల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్ జిల్లాల అటవీ అధికారులు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్‌తో పాటు డీసీఎఫ్, ఎఫ్‌డీఓలు పి. క్రిష్ణమాచార్య, కె.దామోదర్ రెడ్డి, ఏసీఎఫ్, ఎఫ్‌డీఓలు ఎస్.సుజాత, సయ్యద్ మక్సూద్, బి.బాబు, వి.చంద్రశేఖర్, వి.మంజుల, యూ.కోటేశ్వరరావు, సందీప్‌రెడ్డి, భాగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలింతపై గుర్తు తెలియని వ్యక్తి దాడి



దాడిలో గాయపడిన బానోత్ నందిని

జూలూరుపాడు: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన జూలూరుపాడు మండలం మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దతండాకు చెందిన బానోత్ నందిని తన రెండు నెలల చంటి బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి భర్త భద్రం అలియాస్ పండు ఉన్నాడా? అంటూ అడుగుతూనే ఆమెపై స్టిక్‌రాడ్‌తో దాడి చేశాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండడంతో ఆమె పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చేలోపే అక్కడ నుంచి దుండగుడు బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని కొత్తగూడెం వైపు పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ నందినిని స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నందినితో భర్త భద్రం తరుచూ గొడవ పడుతుండేవాడని, పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. భద్రం మరో మహిళను పెళ్లి చేసుకుని ఆమె కూడా ఒకే ఇంట్లో అందరూ కలిసి ఉంటున్నారు. శనివారం ఉదయం నందిని భర్త భద్రం, అత్త సరోజలు ఇద్దరు కలిసి దుబ్బతండాలో బంధువు ఒకరు చనిపోతే అక్కడ వెళ్లగా, రెండో భార్య కొత్తగూడెంలోని ఓ షాపింగ్ మాల్ పని చేయడానికి వెళ్లింది. ఇంట్లో నందిని ఒంటరిగా ఉన్న సమయాన ఈ దాడి జరిగింది. మహిళ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## 36.43 కేజీల గంజాయి స్వాధీనం

**మణుగూరులో 16.43 కేజీలు, భద్రాచలంలో 20 కేజీల పట్టివేత**



మణుగూరు టౌన్: స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



భద్రాచలంటౌన్: పట్టుబడిన గంజాయితో నిందితులను చూపిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: ఒరిస్సాలోని మల్కాజ్గిరి నుంచి టేకులపల్లి, జగిత్యాల, సూర్యాపేటకు గంజాయిని తరలిస్తూ ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు మణుగూరు శివారులో చిక్కిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఒరిస్సా నుంచి 16.43 కేజీల గంజాయిని మూడు బైక్‌లపై తరలిస్తుంన్నారు. ఈక్రమంలో మణుగూరు రథంగుట్ట వద్ద తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈనేపథ్యాన గంజాయి తరలిస్తున్న జగిత్యాలకు చెందిన కమల అరవింద్, మారంపల్లి లక్ష్మణ్, సూర్యాపేటకు చెందిన బొమ్మకంటి గోపి, పర్స బోయిన రమేశ్, ఇదే జిల్లా టేకుపల్లి చెందిన బుక్యా సాయికుమార్, గుగులోత్ నవీన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.శ్రీనివాస్, సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకట్, విజయ్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

**భద్రాచలంలో 20 కేజీలు..**

భద్రాచలంటౌన్: ఒడిశా సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈసీ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికారులు తనిఖీలు నిర్వహించగా.. గంజాయి తరలిస్తున్న ఒక కారును పట్టుకుని సోదా చేశారు. దీంతో 20 కిలోల ఎండు గంజాయి పట్టుబడడంతో పాటు నిందుతుల నుంచి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఏఈసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎక్సైజ్ సీఐ షేక్ రహీముని బేగం, ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి ఎస్.నర్సింహమూర్తి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, సీనియర్ పీడీలు పీవీ రమణ, రామారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అండర్–17 బాలికల విభాగం 100 మీటర్ల విభాగంలో ఎ.మనుశ్రీ, మనస్విత, సీహెచ్ అక్షిత, కె.సౌమిత, 200 మీటర్ల పరుగులో ఎ.మనుశ్రీ, బి.మనస్విత, పి.మేదా, 400 మీటర్ల పరుగులో వి.వినిత, డి.సాగరిక, బి.కతిత, 800 మీటర్ల పరుగులో బిహానీ, కె.సంవిధ, డి.త్రిష, 1500 మీటర్ల పరుగులో ఎస్‌కే సానియా, డి.అభినయశ్రీ, ఎస్‌కే ఉజ్మ, 3 వేల మీటర్ల పరుగులో ఎస్.మేఘన, పి.సుచిత, ఎస్‌కే సానియా, అండర్–14 బాలురలో 100 మీటర్ల పరుగులో డి.సంతోష్, బి.నరేశ్, వి.చరణ్‌గౌడ్, 200 మీటర్లలో జి.కింగ్, వి.చరణ్‌గౌడ్, హెచ్.అభి, 400 మీటర్ల పరుగులో ఎ.మధుదీప్, ఐ.చరణ్, కె.విజయ్‌రామ్, 600 మీటర్ల పరుగులో కె.విజయ్‌రామ్, కె.గోపాల్‌కృష్ణ, ఎ.వరుణ్, షాట్‌పుట్‌లో బి.చందూలాల్, బి.నరేశ్, ఎస్.ఉమర్ ఫారుక్, లాంగ్‌జంప్‌లో హెచ్.అభి, వి.చరణ్‌గౌడ్, హెచ్.అఖిల్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. బాలికల విభాగం 100 మీటర్ల పరుగులో బి.రుచిత జి.రాణి, కె.స్లామా, 200 మీటర్లలో బి.రుచిత, కె.హస్మిత, ఎం.భవిత, 400 మీటర్లలో ఎం.భవిత, బి.దీక్ష, ఎండీ అఫ్రీన్, 600 మీటర్లలో ఎస్‌కే సాల్మా మేతార్, ఎస్.మేరీ, పూజ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఆదివారం స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఇందులో ఒకరిని అదుపులోకి తీసుకోగా, నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ. 2 వేలు నగదు స్వాధీనం చేసుకొని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

**మామిళ్లవారిగూడెంలో..**

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్లవారిగూడెం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాయతి రాజు తెలిపారు.

## సేవా కార్యక్రమాలను విస్తృతపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ఇల్లెందురూరల్: రానున్న రోజుల్లో పేదలను ఆదుకునేలా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలను విస్తృతపరచాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దారా రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి సత్రంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడంతో పాటు పేద ఆర్యవైశ్యులకు గ్రూపు ఇన్సూరెన్స్ రూ.లక్ష వరకు ఉచితంగా చేయించడం, ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు రాజకీయాలలోకి వస్తే వారికి సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఝెలుగూరి నగేశ్‌కుమార్, కోశాధికారి తాత శ్రీనివాస్, ఇల్లెందు మండల, పట్టణ యువజన అధ్యక్షులు పొద్దుటూరి నాగేశ్వరరావు, ఆర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రల అను, పుల్లూరి జ్యోతి, పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, సాయి, బసవయ్య, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా స్వామి

ఖమ్మంలీగల్: ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది స్వామిరమేశ్‌కుమార్ ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మెన్నార్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన ఫెడరేషన్ ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ బాడీ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన నాలుగేళ్లు కొనసాగుతారు. కాగా, పలువురు న్యాయవాదులు ఆయన్ను అభినందించారు.

## విద్యా వ్యవస్థలో పీఆర్టీయూ పాత్ర కీలకం

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: విద్యా వ్యవస్థలో పీఆర్టీయూ పాత్ర కీలకమైదని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పీఆర్టీయూ నాల్గవ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన మాట్లాడారు. ఈమేరకు పీఆర్టీయూ పాత్ర, వారు చేస్తున్న సేవలను ప్రశంసించారు. రాబోయే కాలంలో సంఘానికి అన్ని విధాల తన సంపూర్ణ సహాయ, సహకారాలను అందిస్తానని అన్నారు. తొలుత జిల్లాలోని గిరిజన, గిరిజనేతర ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ.. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవిల ఆధ్వర్యాన కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి విద్యానగర్ కాలనీ వరకు ఉపాధ్యాయ, ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్‌లు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో గిరిజన, గిరిజనేతర ఉపాధ్యాయులు ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ సరైన హక్కు పత్రాలతో ఇల్లు కట్టుకోలేకపోతున్నారని, రిజిస్ట్రేషన్ కాక గృహ రుణాలు మంజూరు కావడం లేదని, తక్కువ వడ్డీ, ఆదాయ పన్ను నుంచి మినహాయింపు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. అంతేకాక గత రెండేళ్లుగా ప్రభుత్వం డీఏలు మంజూరు చేయడం లేదని, నూతన పెన్షన్ విధానం పేరుతో సీపీఎస్‌ఓ, యూపీఎస్ అంటూ ఉద్యోగులను ఆందోళనకు గురి చేయడం సరికాదని పేర్కొంటూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ ఎంఈఓ, డిప్యూటీ ఈఓల పదోన్నతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా, మండలాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## లంబాడీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని లంబాడీ ప్రజా సంఘాల ఐక్య వేదిక జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో లంబాడీల ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, బానోత్ లాల్‌సింగ్ నాయక్‌లు మాట్లాడుతూ.. కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏఎంసీ చైర్మన్ పదవిని లంబాడీలకు కేటాయించాలని కోరారు. గిరిజన గ్రామ పంచాయతీలను కలుపుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి 100 శాతం రిజర్వేషన్లతో పాటు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీలకు మంత్రి పదవి ఇచ్చి ప్రభుత్వంలో భాగస్వాములను చేయాలని, లేనిపక్షంలో ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బానోతు లాల్ సింగ్‌నాయక్, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షులు మాలోతు శివనాయక్, లావుడ్యా ప్రసాద్‌నాయక్, కేశవ్‌నాయక్, జుంకిలాల్ నాయక్, లాల్ నాయక్, రాములు నాయక్, బాలకృష్ణ చౌహాన్, రత్నకుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆరోపణలు అవాస్తవం..

**మెప్మా సీఓ నాజర్**



సీఓ నాజర్

మణుగూరుటౌన్: గత కొంతకాలంగా పాలమూరు శ్రీదేవి, ఆమె భర్త వెంకట రమేశ్‌లు వరుసగా తప్పుడు ఫిర్యాదు చేయడంతో పాటు ధర్నాలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని మెప్మా సీఓ నాజర్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. 2016 నుంచి మూడేళ్లుగా ఆర్‌పీగా పనిచేసిన శ్రీదేవి రూ.2లక్షలకు పైగా అవినీతి చేసి వ్యక్తిగతంగా వాడుకుందన్నారు. ఈనేపథ్యాన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో ఆమె నుంచి రూ.1.10 లక్షలను ఓబీలకు కట్టించి విధుల నుంచి తొలగించి శ్వేతరమ్యను ఎన్నుకున్నారన్నారు. దీంతో తనపై కక్ష పెట్టుకుని శ్రీదేవి ఆమె భర్తలు గడిచిన ఐదేళ్లుగా ఫిర్యాదులు చేస్తూ తనను అబాసుపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాక లైంగికంగా వేధింపులకు గురి చేశానని ఫిర్యాదు చేయగా..విచారణకు వచ్చిన అధికారులు కూడా అది అవాస్తవం అని తేల్చారన్నారు. వీటన్నింటి దృష్ట్యా శ్రీదేవి ఆమె భర్తపై పరువునష్టం కింద దావా చేయడంతో ఇప్పుడు రావుల కుమారస్వామి అనే దివ్యాంగుడితో సోషల్ మీడియాలో మర్యాదకు భంగం కలిగేలా తప్పుడు పోస్టులు పెడుతుందని తెలిపారు. ఫిర్యాదులు చేయకుండా ఉండాలంటే రూ.5లక్షలు నగదు ఇవ్వాలని, లేకపోతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

## అటు ఎండ.. ఇటు వాన!



ఎండ కొడుతూ వాన పడుతున్న దృశ్యం

వాతావరణంలో భిన్నమార్పులు చోటుచేసుకోవడంతో ఆదివారం మండల కేంద్రంలో అనూహ్య ఘటన జరిగింది. ఓ వైపు ఎండ కొడుతుంటే మరోవైపు చిరుజల్లులతో కూడిన వాన కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ కొట్టి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడింది. ఈమేరకు ఎండలో వేడి, వర్షంలో చల్లదనం మానవ జీవితంలో సమస్యలు, పరిష్కారాలు ఎలా ఉంటాయో గుర్తుకు తెస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ దృశ్యాలను 'సాక్షి 'తన కెమెరాలో బంధించింది. – కరకగూడెం

## నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



మనస్వీక (ఫైల్)

కొణిజర్ల: నీటి తొట్టిలో పడి చిన్నారి బాలిక మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతల వెంకటకృష్ణ, సమత దంపతులకు కుమారుడు తరుణ్‌సాగర్, కూతురు మనస్వీక (13 నెలలు) ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు భోజనం చేస్తుండగా మనస్విని ఆడుకుంటూ బయటకు వచ్చింది. ఈ క్రమంలో ఇంటి బయట ఒక్క ఒరతో ఏర్పాటు చేసుకున్న చిన్న నీటి తొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడింది. అన్నం తిని చేయి కడుక్కోవడానికి తొట్టి వద్దకు వచ్చిన తాత కృష్ణయ్య నీళ్లలో పడి ఉన్న మనస్వికను చూసి కంగారుగా ఎత్తుకుని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఇటీవలే చిన్నారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారి మృతితో కొణిజర్ల యాదవబజార్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

**అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ...**

మధిర: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన కంపసాటి కొండ (32) హైదరాబాద్‌లో ఈ నెల 27న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాయపట్నం గ్రామానికి చెందిన రాజు, అచ్యుత్‌రావు చోరీ కేసుకు సంబంధించి జామీన్‌గా ఉండేందుకు కొండను హైదరాబాద్ తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలో కొండ బహిర్భూమి కోసం వెళ్లి డ్రెయినేజీలో పడి మృతిచెందినట్లు అతడిని తీసుకెళ్లిన వ్యక్తులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య ఆశ మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడు రాయపట్నంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని అచ్యుత్‌రావు ఇంటి ముందు పెట్టి ఆందోళన చేపట్టారు.

## వ్యక్తి ఆత్మహత్య

నేలకొండపల్లి: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అవిటి మారిబాబు (48) భార్య ఏడాది కిందట మృతిచెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మనోవేదనకు గురవుతున్నాడు. ఆదివారం గడ్డి మందు తాగి శంకరగిరితండా సమీపంలో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.